ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5★★

జగిత్యాల

జిల్లా వార్తలు

ఆదివారం 24 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ | 6:34
ఆదివారం

సహర్ | 4:54
సోమవారం

టీఎన్‌జీవో నాయకుడికి సన్మానం

మల్యాల, మార్చి 23: టీఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉపాధ్యాయుల చంద్రశేఖర్‌ను జగిత్యాల టీజీవో నాయకులు సన్మానించారు. వేములవాడ రాజ రాజేశ్వర ఆలయం నుంచి ఇటీవల కొండగట్టుకు బదిలీపై వచ్చిన చంద్రశేఖర్‌ను పూలమాలలతో సత్కరించి అభినందించారు. జిల్లా కార్యదర్శి మామిడి రమేష్, ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రసాద్, శ్రీనివాస్, మల్లయ్య, నగేష్ పాల్గొన్నారు

ఎన్నిక దూరం అదనపు భారం



- పోలింగ్‌కు ఇంకా నెలన్నరకు పైగా సమయం
- కేడర్‌ను కాపాడుకోవడం పార్టీలు, అభ్యర్థులకు భారమే..
- ఖర్చు తడిసి మోపెడవుతుందని భయం
- పార్లమెంట్ ఎన్నికలపై రాజకీయ పార్టీల గాబరా

జగిత్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లోక్ సభ ఎన్నికలు ప్రధాన పార్టీలు, అభ్యర్థులకు ఖర్చుతో కూడుకున్న పనిగా మారింది. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన ప్రకారం రాష్ట్రంలో మే 13వ తేదీన పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు ఇంకా సుమారు నెలన్నరకు పైగా సమయంలో ఉండడంతో అప్పటివరకు క్యాడర్‌ను మెయిటెన్ చేయడం అభ్యర్థులకు భారంగా మారనుంది. పోలింగ్ పూర్తయ్యే వరకు ఖర్చులు తడిసి మోపెడవుతాయన్న భయం పార్టీ నేతల్లో పట్టుకుంది. పార్లమెంట్ ఎన్నికల పోటీ చేయనున్న అభ్యర్థులతో పాటు ఆయా అసెంబ్లీ నియోజక వర్గాలకు ప్రధాన పార్టీల తరఫున ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న నేతలకు సైతం అదనపు భారం పడుతోంది. ఆయా సెగ్మెంట్‌లలో తమ తమ పార్టీలకు ఆధిక్యత తీసుకొని రావడానికి ఆయా పార్టీల అసెంబ్లీ ఇన్‌చార్జిలు సైతం క్యాడర్‌ను కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నారు.

లోక్ సభ ఎన్నికలు ప్రతిష్టాత్మకమే...

ప్రధాన పార్టీలు లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసే బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించలేదు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయంలో తర్జన భర్జన పడుతోంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డిలకు టిక్కెట్లు కేటాయించాయి.

అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి పాలై అధికారానికి దూరమైన బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికల్లో గెలవడం ద్వారా పార్టీ ఉనికిని చాటుకోవాలనే ప్రయత్నం చేస్తోంది. వంద రోజుల క్రితమే రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఎంపీ ఎన్నికల్లో ఓడిపోతే ప్రభుత్వం మీద ప్రభావం పడుతుందని భావిస్తున్న అధికార పక్షం ఈ ఎన్నికలలో గెలుపుకోసం సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమవుతోంది. కేంద్రంలో మూడో సారి మోదీ సర్కారు నినాదంతో ఎన్నికల బరిలో దిగిన బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా నిజామాబాద్ సీటును కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ముందుకు సాగుతోంది. నిజామాబాద్‌ను గెలుచుకునేందుకు ప్రధాన పార్టీలు ఎత్తులుపై ఎత్తులు వేస్తున్నాయి.

యంత్రాంగానికి సవాలే...


ఎన్నికలకు ఎక్కువ సమయం ఉండడంతో అధికార యంత్రాంగం పైనా భారం పడనుంది. అన్ని రోజులు ఎన్నికల కోడ్‌ను పర్యవేక్షించడం ఇబ్బందికరంగా ఉంటుంది. షెడ్యూల్ వెలువడిన రోజు నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం, వాటిని పరిష్కరించడం అధికారులకు కొంత ఇబ్బందికరంగా మారుతాయని భావిస్తున్నారు.

ఓటర్లను ఆకట్టుకోవడం కష్టమే...

ప్రధాన రాజకీయ పక్షాలు, అభ్యర్థులు మరోవైపు వివిధ రకాలుగా ఓటర్లను ఆకట్టుకోవడం కూడా అధికంగా భారంగా మారనుంది. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, ప్రచారానికి తరలివచ్చే శ్రేణులకు విందులు, రవాణా సదుపాయాలు వంటివి భరించాల్సి ఉంటుంది. అలాగే ప్రచార సామగ్రిని సమకూర్చకోవడం కూడా ఆర్థికంగా భారం కానుంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఎన్నికలు జరిగే నాటికి నెల రోజుల వ్యవధి ఉంటే ఆర్థికంగా కొంత తక్కువ భారం పడేది. అందుకు ఏప్రిల్ ఎంతో అనుకూలమని భావించారు. కానీ మే 13వ తేదీన ఎన్నికలు నిర్వహించడం వల్ల అప్పటి వరకు ఎన్నికల ఖర్చుతో పాటు ప్రచారం చేయడం కూడా భారంగా ఉంటుందని ప్రధాన పార్టీలకు చెందిన పలువురు నాయకులు అంటున్నారు.

అభ్యర్థులు, పార్టీలకు చుక్కలే...

లోక్‌సభ ఎన్నికలకు ఇంకా దాదాపు నెలన్నర సమయం ఉంది. ఈ నెలన్నర రోజులు ఆయా పార్టీలకు, అభ్యర్థులకు చుక్కలు కనబడతాయని భావిస్తున్నారు. మే 13వ తేదీన ఎన్నికలు జరుగుతుండడంతో షెడ్యూల్‌కు, పోలింగ్‌కు మధ్య సమయం ఎక్కువగా ఉంది. సుమారు నెలన్నర రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు, కాడర్ మెయింటెనెన్స్ అనేది అభ్యర్థులకు తలకు మించిన భారం అవనుంది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఏడు నియోజక వర్గాలలోని పార్టీ ముఖ్య నేతలు ద్వితీయ శ్రేణి నాయకులు, క్యాడర్‌కు కావాల్సిన సౌకర్యాలన్నీ కల్పించాల్సి ఉంటుంది. చిన్న నిర్లక్ష్యం జరిగిన పార్టీ వీడుతా మంటూ బెదిరించే వారూ ఉంటారు. ఎవరు ఏ రోజు ఏ పార్టీలోకి చేరతారో తెలియని పరిస్థితి ఉంటుంది. మరోవైపు ఎన్నికలకు సమయం ఎక్కువగా ఉండడం ప్రచారానికి కలిసి వచ్చే అంశమే. అభ్యర్థులు రోజూ ఐదు నుంచి పది గ్రామాల చొప్పున తిరిగినా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలకు వెళ్లడానికి సమయం సరిపోతుందని భావిస్తున్నారు. అయితే ఆయా గ్రామాలకు వెళ్లే క్రమంలో ఖర్చులు కూడా ఎక్కువగానే ఉండనున్నాయి.



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన జిల్లా నేతలు



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నూనె శ్రీనివాస్, శ్రీనివాస్ రావు

జగిత్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిని హైద్రాబాద్‌లో జిల్లాకు చెందిన పలువురు నేతలు కలిశారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌కు వెళ్లిన జిల్లా రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, వెల్గటూరు మాజీ ఎంపీపీ పునుగోటి శ్రీనివాస్, నాయకులు సుగ్రీవ రావు, గెల్లు శేఖర్, ఎల్క రాజులు గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాసు మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్‌లో చేరిన నూనె శ్రీనివాస్, పును గోటి శ్రీనివాస్‌లను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈకార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



శేషప్ప కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన

ధర్మపురి, మార్చి 23: ధర్మపురి క్షేత్రంలోని శేషప్ప కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన నృత్య కిన్నెర డ్యాన్స్ అకాడమీ అండ్ మ్యూజిక్ వారిచే నిర్వహించబడిన ఉషాగాయత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన శనివారం రాత్రి భక్తులను ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కళారుడు గుండి జగదీశ్వర్ భక్తి సంగీతం శ్రోతలను ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన కాలేజీ ఆఫ్ సైన్స్ ఆర్ట్ మ్యూజిక్ ఎడ్యుకేషన్ వారిచే భక్తి సంగీత విభావరి, కరీంనగర్‌కు చెందిన కళాతపస్వి రతన్‌కుమార్‌చే నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. కళాకారులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ జక్కు రవీందర్ శాలువా కప్పి సన్మానించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జిగా ఎస్ఎల్ఎన్ నాట్యమండలి కార్యదర్శి నరహరి, పక్క వాద్య కళాకారులుగా రామయ్య శర్మ, వేణుగోపాల్, రమేష్, శ్రీదర్, రాజేశం, సుదర్శనాచార్యులు వ్యవహరించారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ

కొడిమ్యాల, మార్చి 23 : మండలంలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన మోతె లక్ష్మీ ఇటీవల మృతి చెందగా శనివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, పూడూర్ సింగిల్ విండో ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, అప్పారావుపేట మాజీ సర్పంచు మల్లేశంముదిరాజు, బీఆర్ఎస్ మండల నాయకులు వెంకటేష్‌గౌడ్, రాజేశం, రమేష్, మహేష్ ఉన్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకులు

ధర్మపురి, మార్చి 23: ధర్మపురి మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు ఎగ్గడి ఉషారాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, పరీక్షలకు సంబంధించిన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినందులకు ఎవ్వరు కూడా సమీపంలో ఉండరాదని, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్కార్టుల కు సూచించారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ధర్మపురి ఎంఈవో బత్తుల భూమయ్య, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్ కె. శ్రీనివాస్, ఎం. మహేందర్, బుచ్చన్న, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ కె. ప్రభాకర్, బి. మల్లేశం, ఎం. మదుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని కుమ్మరిపల్లి మాడల్ స్కూల్ పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం రాష్ట్ర పరిశీలకురాలు ఎగ్గడి ఉషారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. బయటి వ్యక్తులను ఎవరినీ పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించవద్దని ఎస్కార్డ్ సిబ్బందికి సూచించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించినందున పరీక్ష కేంద్రం సమీపంలో ఎవరూ గుమిగూడకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బత్తుల భూమయ్య, చీఫ్ సూపరింటెంట్ రాజారాణి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ప్రభాకర్, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రాజమణి పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ఎంపీ ధర్మపురి అర్వింద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

బీర్‌పూర్, మార్చి 23: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మండలంలోని తుంగూర్ గ్రామంలో శనివారం బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అధితిగా పాల్గొన్న ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో విజయం సాధించే దిశగా పనిచేయాలని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ, బీర్‌పూర్ మండల అధ్యక్షులు ఆడెపు నర్సయ్య, సారంగాపూర్ మండల అధ్యక్షులు ఎండబెట్ల అరుణ్, నాయకులు పాత రమేష్, గర్శకుర్తి శిల్ప రమేష్, రమేష్, అజయ్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి అందరి సహకారం అవసరం

పెగడపల్లి, మార్చి 23 : ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అవసరమని పెగడపల్లి స్వయంభూ శ్రీరాజ రాజేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ ఒరుగల శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్వయం భూ శ్రీరాజ రాజేశ్వరస్వామి ఆలయ సర్వసభ్య సమావేశం కమిటీ నూతన ఛైర్మన్ ఒరుగల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశమై ఆదాయ వ్యయాలు, ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలు, దాతల సహకారం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో తాజా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, జాల తిరుపతి రెడ్డి, గౌరవాధ్యక్షులు గంగారెడ్డి, కమిటీ కార్యదర్శి రాంచంద్రం, ఉపాధ్యక్షులు శేఖర్, శ్రీనివాస్, కోశాదికారి గోపి, సంయుక్త కార్యదర్శులు కిషన్ రావు, మల్లేశం పాల్గొన్నారు.

విద్యార్థులు పార్లమెంట్‌పై అవగాహన పెంచుకోవాలి

జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్

కొడిమ్యాల, మార్చి 23 : విద్యార్థులు విద్యతో పాటుగా దేశ రాజకీయాల పట్ల, భారత దేశ చట్టాలను రూపొందించే పార్లమెంట్‌పై అవగాహనను పెంచుకో వాలని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ వి. కామాక్షిప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్రం జగిత్యాల వారి సహకారంతో జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రిన్సిపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. చుట్టు పక్కల వారు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కలిపించాలన్నారు. అంతక ముందు అసోసియేట్ ప్రొఫెసర్ ఎం. తిరుపతమ్మ మాట్లాడుతూ నారీ శక్తి, మహిళా సాధికారతపై అవగాహన కలిపించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ ఆఫీసర్ ఎం. వెంకటరాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ముందుకు సాగాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర అధికారి, ఐటీ హెచ్‌వోడీ డా.. ఎస్ సురేష్‌కుమార్, పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మాక్ పార్లమెంట్ పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాలరూరల్, మార్చి 23 : జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని ధరూర్ గ్రామ శివారులో శనివారం మధ్యాహ్నం షైదం అజయ్ అనే గంజాయి విక్రేతను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ తెలిపారు. శనివారం జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో విలేకర్ల సమవేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాలమేరకు జగిత్యాల రూరల్ ఎస్.ఐ సధాకర్ తన సిబ్బందితో ధరూర్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానస్పదంగా తిరుగుతున్న అజయ్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా అతని వద్ద నుంచి 260 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడి అజయ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్.ఐ సధాకర్, కానిస్టేబుల్స్ ఎం. శ్రీనివాస్, ఆర్. గంగాధర్, ఏ. మోహన్, పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన

రాయికల్, మార్చి 23: రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని హైస్కూల్‌లో విద్యార్థులకు ఎన్నికల పనితీరు గురించి మాక్ పోలింగ్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుంటే మంచి నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు వేసే విధానం, ఎన్నికల ప్రక్రియ నియమాల గురించి వివరించారు. ప్రస్తుత రోజుల్లో రాజకీయాల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు కైరం సత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

క్షయ నివారణ అందరి బాధ్యత

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవ ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న వైద్యులు

జగిత్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణ అందరి బాధ్య త అని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మోతె మాల వాడ ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఉప వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, లక్షణాలు ఉన్న వారిని గుర్తించి నివారణకు అన్ని రకాల మందులను ఇచ్చేలా చర్యలు చేపడుతుందని వివరించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెల పోషణ భత్యం రూ. 500 ఇస్తుందని వివరించారు. జిల్లాలో ప్రతి ఏటా 1,900 కేసులు నమోదు అవుతున్నాయని ఇప్పడి వరకు ఈ ఏడాదిలో 426 కేసులు గుర్తించామన్నారు. అనంతరం క్షయ వ్యాధి నివారణకు కృషి చేసిన ఉత్తమ ఉద్యోగులను సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేసి వ్యాధి నిర్మూలన దినోత్సవ ప్రతిజ్ఞ నిర్వహించారు. వైద్యాధికారులు గీతిక, శ్రావణి, స్వాతి ఉన్నారు.

కొడిమ్యాల : క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని పూడూర్‌లో అవగాహన, వైద్య శిబిరం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేక పోవటం, బరువు తగ్గటం లాంటి లక్షణాలు ఉంటే తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు చేశారు. క్షయవ్యాధికి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులను ఉచితంగా అందిస్తామన్నారు. ప్రతి క్షయ వ్యాధిగ్రస్తునికి పోషణ భత్యం కింద రూ.. 500 రూపాయలు దాతల సహకారంతో పోషణ కిట్లను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, ఎస్‌టీఎస్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది, లచ్చయ్య. విష్ణు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

కొండగట్టు ఆలయ ఈవో సస్పెన్షన్


పి వెంకటేష్

మల్యాల, మార్చి 23: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో పి వెంకటేష్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు దేవాదాయ కమిషనర్ హన్మంతరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయంలో టెండర్ల సెక్షన్ అధికారి శ్రీనివాసచారి వ్యాపారుల తమ దుకాణాలు తదితర టెండర్లకు సంబంధించిన సుమారు రూ. 37.90 లక్షల మేర సొమ్ములను స్వాహా చేసినట్లు నెలరోజుల క్రితం తెలియడంతో అతన్ని సస్పెండ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2023-24 సంవత్సరానికి గాను మొదట రూ.37.90లక్షలు దేవస్థానం ఖాతాలో జమ కాకపోవడంతో అధికారులు చర్యలు తీసుకోగా మరోసారి రూ.14.49లక్షలు కూడా వెలుగులోకి రావడంతో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి మంగళవారం విచారణ జరిపారు. ఇందులో భాగంగానే గత రెండు రోజుల క్రితం ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీల్‌తో పాటు సస్పెండ్‌కు గురి అయిన శ్రీనివాసచారికి అడిషనల్ మెమోలు జారీ చేశారు. కాగా ఏడీసీ విచారణ నేపథ్యంలో శనివారం ఈవోపై సస్పెన్షన్ వేటు వేశారు. ఉద్యోగి సొమ్ముల వినియోగంపై ఈవో నిర్లక్ష్యం, అలసత్వంగా పేర్కొంటూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్‌కు భాద్యతలు అప్పగించారు. మిగితా భాద్యులపై కూడా త్వరలోనే చర్యలు ఉండే అవకాశం ఉంది.

సాగునీరు అందించి పంటలు ఎండిపోకుండా చూడండి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వేములవాడ/ధర్మారం/ధర్మపురి, మార్చి 23: పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం నాడు హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్, ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి వెళ్లి సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సాగునీటి కొరత కారణంగా వేములవాడ, ధర్మపురి నియోజక వర్గాల పరిధిలో పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తిందని, ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందజేసి పంటలు ఎండిపోకుండా కాపాడాలని కోరారు. అదేవిధంగా, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతన్నలకు ప్రభుత్వం తరపున చేయూతనందించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఆది శ్రీనివాస్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌కు ఫోన్ చేసి సాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి స్థానిక పరిస్థితులను వివరిస్తూ రైతుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులకు వెంటనే సాగునీరు అందించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకుఈ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాలు వేములవాడ, ధర్మపురి నియోజకవర్గాలకు తక్షణమే అందేలా చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. రైతుల సమస్యలను తెలియజేయగానే సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

శాతవాహన వికల్ప ఓవరాల్ చాంపియన్‌గా 'అల్ఫోర్స్'



ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన అల్ఫోర్స్ మహిళా కళాశాల విద్యార్థులు

కరీంనగర్‌రూరల్, మార్చి 23: శాతవాహన యూనవర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేనేజ్‌మెంట్ మీట్ అరోహణ-2024 ఓవరాల్ చాంపియన్ షిప్‌ను అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల కైవసం చేసుకుంది. కళాశాల ఆవరణలో శనివారం కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. అరోహణ-2024లో ఏడు అంశాలకు ఆరు అంశాలలో ప్రతిభ చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ బి విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా కామదహనం

- రాజన్న సన్నిధిలో త్రిరాత్రి ఉత్సవాలు ప్రారంభం


కామదహనం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి 23: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శనివారం రాత్రి కామదహనం ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ నేతృత్వంలో అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ పడమర స్వాగత ద్వారం వెలుపల పిడకలను పేర్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కామదహనం చేశారు. కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజన్న సన్నిధిలో శివకల్యాణోత్సవాల ప్రారంభానికి ముందు నిర్వహించే త్రిరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయ అద్దాల మంటపంలో పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీ అనంతపద్మనాభస్వామివారి వారల డోలోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన ఊయలల్లో ఉంచి డోలోత్సవం నిర్వహించడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు

వేములవాడ, మార్చి 23: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన స్వామి దేవాలయ ప్రాంగణంలోని నవగ్రహ ఆలయంలో శని త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం త్రయోదశి కలిసి రావడంతో భక్తులు నవగ్రహ మంటపంలోని శనీశ్వరుడిని తైలంతో అభిషేకించడంతో పాటు నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజలలో పాల్గొన్నారు.

అంజన్న సొమ్ములపై అలుసు

- కొండగట్టులో టెండర్ల సొమ్ముల దుర్వినియోగం
- నెల రోజుల క్రితం బయటపడ్డ రూ.37.90లక్షలు
- ఈవో సస్పెన్షన్- పలువురుకి మెమోల జారీ



మల్యాల, మార్చి 23: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో అక్రమాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. తీగ లాగితే డొంక కదిలినట్లు అధికారుల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవలే ఆలయంలో టెండర్ల సెక్షన్ అధికారి శ్రీనివాసచారి వ్యాపారుల తమ దుకాణాలు తదితర టెండర్లకు సంబంధించిన సొమ్ములను స్వాహా చేసినట్లు తెలియడంతో అతన్ని సస్పెండ్ చేయగా తాజాగా శనివారం ఈవో వెంకటేష్ కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. 2023-24 సంవత్సరానికిగానూ మొదట రూ. 37.90 లక్షలు దేవస్థానం ఖాతాలో జమ కాకపోవడంతో అధికారులు శ్రీనివాసాచారిపై చర్యలు తీసుకోగా మరోసారి రూ.14.49 లక్షలు కూడా వెలుగులోకి రావడంతో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి విచారణ జరిపారు. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీల్‌తో పాటు సస్పెండ్‌కు గురి అయిన శ్రీనివాసచారికి అడిషనల్ మెమోలు జారీ చేశారు. ఏడీసీ విచారణతో ఈవో నిర్లక్ష్యం బయటపడడంతో అతడినీ సస్పెండ్ చేశారు. త్వరలోనే మిగితా బాద్యులందరీపై దేవాదాయశాఖ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

● ఆడిట్ అభ్యంతరాలపైనా నిర్లక్ష్యం..

కొండగట్టులో అక్రమాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకునే వారే లేక పోవడంతో లక్షల్లో అంజన్న సొమ్ములు దుర్వినియోగానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. పది సంవత్సరాలుగా ఆడిట్ అధికారులు ఇచ్చే నివేదికలపై చర్యలు ఉండడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2007-18 కాలంలో దాదాపు రూ.14 కోట్లకు సంబందించి ఆడిట్ అధికారులు పలు అభ్యంతరాలు తెలుపగా రెండు కోట్ల వరకు అవకతవకలు జరిగినట్లు అందులో దాదాపు రూ.13లక్షలు అప్పటి అధికారులు చెల్లించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆడిట్ అధికారులు ప్రతి ఏటా అభ్యంతరాలు తెలుపడం, వాటిని పట్టించుకోకపోవడంతోనే అక్రమాలు కొనసాగుతన్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

● రిజిష్టర్లను తీసుకెళ్లిన ఏడీసీ..

కొండగట్టులో ఇటీవల జరిగిన రూ.37.90లక్షల దుర్వినియోగంపై విచారణకు వచ్చిన దేవాదాయ శాఖ ఏడీసీ జ్యోతి మరింత లోతైన విచారణ కోసం 2018 నుంచి గల వివిధ ముఖ్యమైన రిజిష్టర్లు, క్యాష్‌బుక్, డీసీబీ, ఆడిట్ అధికారులు ఇచ్చిన నివేదికలు తీసుకెళ్లగా అక్కడ విచారణ జరుపుతుండడంతో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో దేవస్థానం అధికారుల్లో వణుకు మొదలైంది. అయితే పలు బ్యాంక్ స్టేట్‌మెంట్లు పంపించాలని కోరగా ఇప్పటి వరకు అధికారులు పంపినట్లు సమాచారం.

ప్రస్తుతం రూ.52.39 లక్షల దుర్వినియోగ వ్యవహారంలో ఈవో సస్పెండ్‌కు గురి కాగ మిగితా అధికారులపై త్వరలోనే చర్యలకు ఉపక్రమిస్తున్న నేపథ్యంలో 2018-19 సంవత్సరానికిగాను మరో రూ.17.61 లక్షలు కూడా బ్యాంక్ ఖాతాలో జమ చేయనట్లు చర్చించుకుంటున్నారు. అయితే బ్యాంక్ ఖాతాల వివరాలు పరిశీలించకుండా జమ చేయనట్లు పేర్కొనడం సరికాదని ఈ సందర్భంగా అధికారులు కొట్టి పారేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు పదేళ్ల కాలంగా ఇక్కడి ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక అధికారి నేతృత్వంలో విచారణ జరపాలనే డిమాండ్లు వెల్లువెతుతున్నాయి.

ముగిసిన టాస్క్ శిక్షణ

గణేశ్‌నగర్, మార్చి 23: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) వారి సహకారంతో డెటాబేస్, ఎస్‌క్యుఎల్ పైన ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి శ్రీలక్ష్మి తెలిపారు. టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శోభారాణి, ట్రైనర్ బి స్వప్న పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 23: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదిశలో ఈ నెల 23 నుంచి 27 వరకు జరగనున్న జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లా పైడిపల్లిలో ఈ నెల 8 నుంచి 10వరకు జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు బి సాయికృష్ణ, ఎం చంద్రదీప్, ఎం చంటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మణ్ తెలిపారు. క్రీడాకారులను డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణరావు, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్ అభినందించారు.

భజన పోటీల్లో ప్రథమ బహుమతి

చొప్పదండి, మార్చి 23: శంకరపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి భజన పోటీల్లో చొప్పదండికి చెందిన శ్రీ హనుమాన్ భజన మండలికి ప్రథమ బహుమతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 32 భజన బృందాలు పోటీలో పాల్గొనగా శ్రీహనుమాన్ భజన మండలి సభ్యులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.10,000ల నగదు బహుమతిని అందుకున్నారు. చొప్పదండికి చెందిన చీకట్ల లచ్చయ్య ఉత్తమ గాయకుడిగా ఎంపికై రూ.1,016 నగదు బహుమతి అందుకున్నారు. పోటీల్లో చీకట్ల లచ్చయ్య, డోలక్ రాజు, పిట్టల రఘుమోహన్, దండే కొమురయ్య పాల్గొన్నారు.

బాలికలపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

- ఒక్కో కేసులో రూ. 5వేల చొప్పున జరిమానా - బాధితులకు మూడు లక్షల చొప్పున పరిహారం

జగిత్యాల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ముగ్గురు బాలికలపై అత్యాచారం చేసిన నిందితుడికి ఒక్కో కేసులో 20 ఏళ్ల చొప్పున జైలు శిక్షతో పాటు ఒక్కో కేసులో రూ. 5 వేల చొప్పున జరిమానాతో పాటు ఒక్కో బాధితురాలికి రూ. మూడు లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని జగిత్యాల కోర్టు న్యాయాధికారి నీలిమ శనివారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపల్లి మండలం దట్నూరు గ్రామానికి చెందిన కొడిమ్యాల హరికృష్ణ అలియాస్ హరీష్ అనే వ్యక్తి గ్రామంలో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. నిత్యావసర సరుకుల కోసం దుకాణానికి ఒంటరిగా వచ్చే బాలికలను టార్గెట్‌గా చేసుకుని ట్రాప్ చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. బాలికలకు మాయమాటలు చెబుతూ తన ఫోన్ ఇస్తూ గేమ్స్ ఆడుకునేలా చేసేవాడు. అనంతరం ఫోన్‌లో ఉన్న అశ్లీల వీడియోలను, చిత్రాలను చూపిస్తూ లైంగిక దాడికి పాల్పడేవాడు. బెదిరింపులకు పాల్పడుతూ బైక్‌పై ఎక్కించుకుని రహస్య ప్రాంతాలకు తీసుకెళ్లి అఘాయిత్యాలకు పాల్పడేవాడు. భయ బ్రాంతులకు గురి చేసి విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడేవాడు. ఇలా ముగ్గురు బాలికలపై హరికృష్ణ లైంగిక దాడికి పాల్పడినట్లు, వికృత చేష్టలను గమనించిన ఓవ్యక్తి జరిగిన విషయాన్ని బాలికల తల్లిదండ్రులకు సమాచారం అందించాడు.

దీంతో బాలికల తల్లులు 2022 ఏప్రిల్ 7వ తేదీన గొల్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై శ్రీధర్ రెడ్డి విడివిడిగా కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ప్రకాష్, సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాల త్రిపుర సుందరి కేసు వాదించగా కోర్టు డ్యూటి అధికారులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. విచారణ చేపట్టిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో మూడు కేసులకు విడివిడిగా తీర్పు వెలువరించారు. ముద్దాయికి ఒక్కో కేసులో 20 సంవత్సరాల చొప్పున జైలు శిక్షతో పాటు ఒక్కో కేసులో ఐదు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. బాధిత బాలికలు ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని శనివారం తీర్పు ఇచ్చారు.

ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీక్ష

భగత్‌నగర్, మార్చి 23: కరీంనగర్ జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లతో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి వినోద్‌కుమార్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజియన్‌లలో లాభనష్టాలు, రానున్న నూతన ఆర్థిక సంవత్సరంలో లాభాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. రాబోయే వేసవి దృష్ట్యా బస్‌స్టేషన్‌లలో పరిశుభ్రమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. మేడారం జాతరకు తగినన్ని బస్సులు నడిపించి విజయవంతం చేసినందుకు అభినందించారు.

ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు డిసాలమన్, వెంకన్న, జె శ్రీలత, జానీరెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, ఎ విలాస్‌రెడ్డి, సుగుణాకర్, కె యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల దిగ్బంధానికి వ్యూహరచన

- గడ్చిరోలిలో మూడు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమావేశం
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ వ్యూహం


మూడు సరిహద్దు రాష్ట్రాల సమావేశానికి హాజరైన పోలీస్ ఉన్నతాధికారులు

గోదావరిఖని, మార్చి 23: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మూడు రాష్ట్రాల పోలీస్ యంత్రాంగం ఏకముఖంగా మావోయిస్టులను కట్టడి చేయడం, వాళ్ల కదలికలను నియంత్రించడం, పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడం లక్ష్యంగా వ్యూహరచన చేస్తున్నారు. శనివారం గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. గడ్చిరోలి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ అంకిత్ గోయల్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. రామగుండం పోలీస్ కమిషనర్(ఐజీ) ఎం శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టు కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, జాగ్రత్తలపై చర్చించారు. ప్రధానంగా మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా పెంచాలని, సంబంధిత సమాచారాన్ని మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంత పోలీసులు పరస్పరం చేరవేసుకోవాలని నిర్ణయించారు. తద్వారా మావోయిస్టులను కట్టడి చేయడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశం, నిష్క్రమణ మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీ తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్‌బీడబ్ల్యూ వారెంట్ల విషయంలో, నేరాల కట్టడి, కేసుల విషయంలో కూడా ఒకరికొకరు సహకరించుకోవాలని చర్చించారు. ఈ సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు సీఆర్‌పీఎఫ్ డీఐజీ(ఆపరేషన్) జగదీష్ ఎన్ మీన, గడ్చిరోలి ఎస్పీ నిలోత్పల్, ఐపీఎస్ అధికారులు నిఖిల్ పింగ్లే, ఎస్పీ గోండియా, కిరణ్ కరే, ఎస్పీ భూపాలపల్లి కిరణ్‌ఖరే, ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్, డీసీపీ(మంచిర్యాల) అశోక్‌కుమార్, ఏడీఎస్పీ గడ్చిరోలి(అడ్మిన్) కుమార్ చింత, అదనపు ఎస్పీ(ఆపరేషన్) యతీష్‌దేశ్‌ముఖ్, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గన్నేరువరం, మార్చి 23: మండలంలోని ఖాసింపేట గ్రామశివారు నుంచి వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. రెవెన్యూ అధికారులతో కలిసి వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

జమ్మికుంట రూరల్, మార్చి 23: జమ్మికుంట పట్టణంలోని రిలియన్స్ పెట్రోల్ పంపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు శనివారం గాయాలపాలయ్యారు. ఎంగేటి సంపత్ అనే యువకుడు తన స్నేహితుడు ఎం శరత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై జమ్మికుంట వైపు వస్తున్నారు. అదే సమయంలో తనుగుల గ్రామానికి చెందిన తిరుపతి అటువైపుగా ద్విచక్రవాహనంపై వచ్చాడు. రిలియన్స్ పెట్రోల్ పంపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో సంపత్, శరత్‌లకు గాయాలయ్యాయి. తిరుపతి అనే వ్యక్తి అజాగ్రత్తగా నడిపి తమ కుమారుడి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడని బాధితుడి తండ్రి మదనయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తిరుపతిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, మార్చి 24: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లాలో వారం రోజులుగా పలువురు సైబర్ నేరస్థుల వలలో చిక్కి రూ. 5.03లక్షలు మోసపోయారని ఎస్పీ తెలిపారు. శనివారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. వేములవాడ పట్టణంలో స్టాక్ మార్కెట్ పేరుతో ఓ బాధితుడికి ట్రేడింగ్ యాప్‌లో ఇన్వెస్ట్ చేయాలని చెప్పగా వెంటనే రూ. 2.77లక్షలు పంపి మోసపోయాడన్నారు. ఇదే విధంగా సిరిసిల్ల పట్టణంలో ఓ బాధితుడు సోషల్‌మీడియాలో పెన్సిల్ ప్యాకింగ్‌లో పార్ట్‌టైం జాబ్ ఆడ్‌చూసి వెంటనే నమ్మి రూ. 15వేలు పంపి మోసపోయాడన్నారు. మరో వైపు సిరిసిల్లలో ఓ బాధితుడికి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని గుర్తుతెలియని వ్యక్తి నుంచి కాల్ చేసి చెప్పగా ఓటీపీ షేర్ చేయడంతో సైబర్ నేరగాళ్లు ఖాతా నుంచి రూ. 1.70లక్షలు కొల్లగొట్టారని ఆయన తెలిపారు. ఇల్లంతకుంట మండల పరిధిలో ఓ బాధితుడు పార్ట్‌టైం జాబ్ కోసం వెతుకుతుండగా వాట్సాప్‌కు మెసెజ్ రావడంతో స్పందించి టాస్క్ పేరుతో కొంత పెట్టుబడి పెట్టాలని చెప్పగా వెంటనే 41వేల రూపాయలు పంపి మోసపోయాడన్నారు. సైబర్ నేరగాళ్ల ఆశ, భయం అనే రెండు అంశాల మీద అమాయక ప్రజలు మోసపోతున్నారన్నారు. ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని, సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ప్రజలు ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ 1930కి, డయల్ 100కు కాల్‌చేసి తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఆల్‌ఇండియా పోలీస్‌మీట్‌లో కరీంనగర్‌కు కాంస్య పతకం


హెడ్‌కానిస్టేబుల్ సత్యంను అభినందిస్తున్న సీపీ

కరీంనగర్ క్రైం, మార్చి 23: హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బాడ్మింటన్ అకాడమీలో జరిగిన 16వ ఆల్‌ఇండియా పోలీస్‌మీట్‌లో కరీంనగర్ కమిషనరేట్‌లో కోర్టు డ్యూటీ నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మచ్చ సత్యం కాంస్య పతకం సాధించారు. 55 సంవత్సరాల విభాగంలో పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా సత్యంను శనివారం పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి అభినందించారు.

ఇసుక లారీ పట్టివేత

జమ్మికుంట రూరల్, మార్చి 23: జమ్మికుంట మండలం విలాసాగర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఆశోక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఎలక్ట్రికల్ దుకాణం దగ్ధం

జగిత్యాలరూరల్, మార్చి 23: జగిత్యాల మండలంలోని ధరూర్ గ్రామంలో శ్రీరామ్ ఎలక్ట్రికల్, సానిటరీ దుకాణం షార్ట్‌సర్క్యూట్ సంభవించి దగ్ధమైంది. ధరూర్ గ్రామానికి చెందిన అజయ్ ధరూర్ గ్రామంలో ఎలక్ట్రికల్, సానిటరీ దుకాణం నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో దుకాణం మూసివేసి తన ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలోనే ప్రమాదశాత్తు దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. దుకాణం యజమాని ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్‌ఇంజిన్ వచ్చి మంటలు ఆర్పివేశారు. దుకాణంలో సుమారు నాలుగు లక్షలల రూపాయలు నష్టపోయినట్టు బాధితుడు అజయ్ తెలిపారు. సంఘటనకు గల వివరాలను పోలీసులు సేకరించారు.

నృసింహుడి సన్నిధిలో భక్త జన సందడి



లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, వేంకటేశ్వర స్వామి వారల సేవ ఊరేగింపులో పాల్గొన్న అతిథులు

ధర్మపురి, మార్చి 23: ధర్మపురి క్షేత్రంలో భక్త జనం సందడి నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సంఖ్య శనివారం అధికమయ్యింది. ఉదయం నుంచే భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు, సేవా సంస్థ సభ్యులు క్యూలైన్లు వద్ద తాగునీటిని అందించారు. తొక్కిసలాట జరగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో సీఐ రాంనర్సింహరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడో రోజు ఆలయానికి రూ 6,99,038 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ 2,51,902 ప్రసాదాలు విక్రయించగా 3,66,900 లభించాయి. అలాగే అన్నదానం కోసం రూ. 80,236 భక్తులు, దాతలు విరాళాలు సమర్పించారు.

● వేంకటేశ్వరస్వామి వారల సేవ ఊరేగింపు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాత్రి వేంకటేశ్వర స్వామి వారల సేవలను అశ్వ వాహనంపై ఊరేగించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు, నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం పక్కాన ఆరు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్యవైశ్య, నిత్యాన్న సత్రం కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు రవీందర్ పాల్గొన్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 24 న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మ పుష్కరిణిలో పాత నారసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఉంటుంది. శేషప్ప కళా వేదికపై రాత్రి నృత్య ప్రదర్శన, భక్తి సంగీత విభావరి, హరికథ కాలక్షేపం ఉంటుందని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



టీకాలు వేస్తున్న అదనపు పశు వైద్యాధికారి

రాయికల్, మార్చి 23: వేసవి కాలంలో పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అదనపు పశువైద్యాధికారి నరేష్ తెలిపారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో సుమారు 320 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు 3 నెలల వయస్సు దాటిన ప్రతి పశువులకు వేయించాలన్నారు. గాలికుంటు వ్యాధి, దూడలలో పారుడు రోగం, గొర్రెలు, మేకలలో షీప్ పాక్స్, ఇతర చర్మ సంబంధ వ్యాధులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజేష్, కొప్పుల గంగారాం, ఎంబారి సాయిరెడ్డి, అంజయ్య, సహదేవ్, హరీష్, పశు వైద్య సిబ్బంది పోచయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వేంపేట గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఏడీఏ డాక్టర్ జి.బక్కయ్య శనివారం ప్రారంభించారు. మెట్‌పల్లి మండల పశుసంవర్ధక శాఖ, కోరుట్ల పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు గ్రామంలోని 287 పశువులకు వేసినట్లు తెలిపారు. అంతకు ముందు గాలికుంటు నివారణ టీకాలు, పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, చూడి పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పరుశురాం, డాక్టర్ విశాల్, మండల పశు వైద్య అధికారి డాక్టర్ మనిషా పటేల్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రమాదేవి, మురళి, రవీందర్ చిరంజన్ దిలీప్, పశుపోషకులు బాపురెడ్డి, నారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి

జిల్లా వ్యవసాయ అధికారి వాణి



ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిణి వాణి

కోరుట్ల రూరల్, మార్చి 23: వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి వాణి సూచించారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి నాగమణి ఏఈఓలతో కలిసి సమీక్ష నిర్వహించారు. మండలంలో సాగు చేస్తున్న పంటల వివరాలతో పాటు రైతులకు ఇస్తున్న సూచనల విధానంపై ఆరా తీశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.

శని త్రయోదశి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జగిత్యాల టౌన్, మార్చి 23: శని త్రయోదశి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం శనిత్రయోదశి రావడంతో భక్తులు శని దేవునికి తైలాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవ గ్రహాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోరుట్ల: పట్టణంలోని శనీశ్వర సహిత అయ్యప్ప స్వామి జ్ఞాన సరస్వతి దేవాలయంలో శని త్రయోదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అర్చకులు త్రిపాఠిశర్మ, గౌతం శర్మల మంత్రోచ్చరణ మధ్య వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి నిత్య అభిషేకం, అర్చన కార్యక్రమాలను జరిపి అమ్మవారికి అర్చన కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం శనీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన నువ్వులు, నూనే అభిషేకం జరిపారు.

ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నాయకులు



ముస్లింలతో కలిసి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల, మార్చి 23: పట్టణంలోని బిలాల్‌పుర ప్రాంతంలో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్ అబ్దుల్ అన్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆయన ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం నాయకులు అడెపు మధు, తిరుమల గంగాధర్, మేకల నర్సయ్య, కొంత రాజలత పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో గంగపుత్ర గూండ్ల సంఘ సభ్యులు

మెట్‌పల్లి, మార్చి, 23 : పట్టణంలోని గంగపుత్ర గూండ్ల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్ష కార్యవర్గ సభ్యులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా తోపారపు రాజేందర్, దుబ్బ రాజయ్య, అధ్యక్షుడిగా ఆర్మూర్ నరేందర్, ఉపాధ్యక్షుడిగా ఆర్మూర్ పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా మగ్గిడి సురేష్, కోశాధికారి న్యావనంది రాజేందర్, సహాయ కార్యదర్శిగా వాల్గొట్ సాయిలతో పాటు ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని సంఘ సభ్యుల శాలువాలతో సత్కరించారు.

ఉపాధి పనుల్లో ప్రథమం..

- జిల్లాలోనే అత్యధికంగా కూలీల హాజరు
- వంద రోజుల పనికి అధికారుల ప్రోత్సాహం
- గ్రామాల్లో జోరుగా ఉపాధి పనులు

మల్యాల, మార్చి 23: గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో మల్యాల మండలం ప్రథమంగా నిలుస్తోంది. జిల్లాలోనే అత్యధికంగా ఈ పనులకు కూలీలు హాజరవుతూ చురుగ్గా పనులు సాగిస్తున్నారు. దీంతో మరిన్ని పనులు చేపట్టే అవకాశం ఉంటుండగా కూలీలకు వేసవిలో చేతి నిండా పని లభిస్తున్నట్లు అవుతోంది. ఉపాధిహామీ పథకం పనులలో భాగంగా ఖండిత కందకాలు, సమత కందకాలు, ఫీల్డ్ ఛానల్, ఫీడర్ ఛానల్, చెరువు పూడిక తీతలు, మామిడి ప్లాంటేషన్ లాంటి పనులు చేపట్టారు. ఈ పనులలో నిత్యం కూలీలు జాతరల పాల్గొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 18 మండలాలు ఉండగా మల్యాల మండలం 76.21 శాతం పని చేస్తున్న కూలీలతో జిల్లాలోనే ప్రథమంగా నిలుస్తుంది. మండలంలోని 19 గ్రామాలలో 8,335 జాబుకార్డులు కలిగిన 1,500ల వరకు పైగా కూలీలు నిత్యం పని చేస్తున్నారు. కూలీలకు నిత్యం రూ.235 నుంచి 272 వరకు కూలీ వేతనం లభిస్తుంది. ఇటీవల కాలంలో మండల వ్యాప్తంగా 2 లక్షల 5878 పని రోజులు పూర్తి కాగ రూ.10.78లక్షల పనులు చేపట్టారు.

వంద రోజులు పూర్తి అయిన వారికి నైపుణ్య శిక్షణ

మండల వ్యాప్తంగా జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం 385 జాబు కార్డులు గల కుటుంబాలు వంద రోజుల పని పూర్తి చేసుకున్నారు. అయితే 100 రోజులు పని చేసుకున్న జాబ్‌కార్డు కుటుంబాలలో విద్యార్హతలను బట్టి అధికారులు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నారు. నూకపల్లి వద్ద గల న్యాక్ కేంద్రంలో ఉచితంగా మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటిషయన్ కోర్సు, టైలరింగ్, యువకులుకు కంప్యూటర్, ఎలక్ట్రిషన్, ప్లంబింగ్ తదితర శిక్షణ, ఇన్సెంటీవ్ ఇస్తుండగా న్యాక్ సర్టిఫికెట్‌తో స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగవకాశాలు లభిస్తున్నాయి. దీంతో వంద రోజుల పని పూర్తి కోసం అధికారులు కార్యచరణతో ముందుకు వెళుతున్నారు. ఏడాదిలో 60 రోజులు పనులు పూర్తి చేసుకున్న వారిని ప్రత్యేకంగా గుర్తిస్తూ వంద రోజులు పూర్తి అయ్యేలా ప్రోత్సాహిస్తున్నారు. దీంతో మండలంలో కూలీల సంఖ్య పెరుగుతుందని ఈజీఎస్ అధికారులు పేర్కొంటున్నారు.



మల్యాలలో కందకాలు తవ్వుతున్న కూలీలు

ప్రత్యేక పర్యవేక్షణ: స్వాతి, ఎంపీడీవో, మల్యాల



ఉపాధి హామీ పనులలో జిల్లాలోనే అత్యధికంగా కూలీలు హాజర వ్వడానికి గాను ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నాం. ఈజీఎస్ గ్రామ సభలలో గుర్తించిన పనులను ప్రణాళికా బద్ధంగా చేపడుతూ కూలీలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. వంద రోజులు సమీపాన గల కూలీలను గుర్తించి వారంత పనులలో పాల్గొనేలా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. మరిన్ని పనులు చేపట్టి కూలీల సంఖ్యను మరింత పెంచడం ద్వారా జిల్లాలో ప్రథమ స్థానాన్ని కొనసాగిస్తాం.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారి, అంగన్‌వాడీ టీచర్లు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య

కోరుట్ల రూరల్, మార్చి 23 : మిల్లెట్స్ ఆహారంతో గర్భిణులు, కిశోర బాలికలు, మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ షైని మాధ్యూ అన్నారు. శనివారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో పోషణ మాసం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, మంజుల, కాళేశ్వరి, సుమతి, శైలజ, విమల పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని అయా గ్రామాలలో పోషణ పక్షోత్సవాలను ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు.

మల్యాల: పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని మద్దుట్ల లోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన నీటి వినియోగం, కిచెన్ గార్డెన్, ఆరోగ్యకరమైన ఆహారం గురించి వివరించారు. అనంతరం సీమంతం, అక్షరభాస్యం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, స్వరూపరాణీ, జలజ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జగిత్యాల రూరల్ మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని సంఘంపల్లి, సోమన్‌పల్లి, హబ్సీపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషన్‌పక్వాడ్ కార్యక్రమం నార్వహించారు. ఈసందర్భంగా ప్రసూతి, చిన్నారుల ఆహారపద్దతులు, తల్లిపాలు, తదితర అంశాల పట్ల గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి కనకలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, నిర్మల, లలిత, శ్రీలత, సుజాత, ఆయాలు ఆశ, సుజాత, చిన్నారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

సారంగాపూర్: గర్భిణులు, చిన్నారులు పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీస్ సూపర్ వైజర్ లత అన్నారు. శనివారం మండలంలోని కోనాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఇంట్లోనే పోష పదార్థల తయారి విధానం, అధిక పోషకాలు ఉండే ఆహర పదర్థాలపై, గర్భిణులకు శ్రీమంతాలు, అన్నప్రాసన, అక్షరబ్యాసం, ర్యాలీ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పదోతరగతి పరీక్షలు

సిరిసిల్ల రూరల్, మార్చి 23: జిల్లాలో పదోతరగతి పరీక్షలు ప్రశాం తంగా కొనసాగుతున్నాయి. 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా శనివారం జరిగిన పరీక్షకు 6475 మంది విద్యార్థులకు 6470 మంది హాజరయ్యారు. కేవలం ఐదుగురు గైర్హాజర్యారు. ఆరుగురు ప్రైవేటు విద్యార్థులకు నలుగురు మాత్రమే పరీక్షకు హాజరైనట్లు జిల్లా విద్యాధికారి రమేష్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను డీఈవో పర్యవేక్షించారు.

దేవాదాయ కమిషనర్‌కు రాజన్న ప్రసాదం



ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ, మార్చి 23 : రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హన్మంతరావుకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు, అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు. దేవాదాయ శాఖ నూతన కమిషనర్‌గా నియామకమైన హనుమంతరావును ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.కృష్ణప్రసాద్ శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం, ఈవో కృష్ణ ప్రసాద్ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు నాగుల మహేష్, సీసీ ఎడ్ల శివ సాయి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి

కొడిమ్యాల, మార్చి 23 : మండలంలోని సంద్రల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతిని పాఠశాల ప్రదానోపాధ్యాయుడు ఏనుగు ఆదిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పెగడపల్లి జడ్పీటీసీ



దీప్ దాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జడ్పీటీసీ రాజేందర్ రావు

పెగడపల్లి, మార్చి 23 : పెగడపల్లి జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు, ల్యాగలమర్రి ఎంపీటీసీ మందపెల్లి అంజయ్యలు శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీప్ దాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పెగడపల్లి జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో వెల్గటూర్ మాజీ ఎంపీపీ పునుగోటి శ్రీనివాస రావు, నియోజక వర్గ మండలాల నాయకులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

చందుర్తి, మార్చి 23 : బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని బండపల్లి లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని శనివారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీకాంతులచారి ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రోచ్చరణల మధ్య వైభవంగా సాగింది. గడ్డం పద్మ- తిరుపతిరెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాల కొండ అరుణ-రాఘవరెడ్డి, బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, ఎంపీపీ బైరగొని లావణ్య, జడ్పీటీసీ నాగం కుమార్, సెస్ డైరెక్టర్ పోన్నాల శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ పొద్దుపొడుపు లింగారెడ్డి, నాయకులు తోట ఆగయ్య, మ్యాకల ఎల్లయ్య పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు

కోరుట్ల, మార్చి 23 : పట్టణంలోని రైసింగ్ పాఠశాలలో శనివారం ముందస్తు హోలీ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు రంగులను చల్లుకొని వేడుకలో పాల్గొన్నారు. విద్యార్థుల కేరింతల మధ్య పాఠశాల ప్రాంతం సందడిగా మారింది. కరస్పాండెంట్ కుడేల్ రాజేంద్ర ప్రసాద్ హోలీ పర్వదినం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుడేల్ లిఖిత, షహనాజ్ బేగం, చిప్ప మోహన్ ఉపాధ్యాయులు వెన్నల, మమత, కవిత, లత, మౌనిక, భూమిక, శివాణీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

భీమారం: భీమారం మండల కేంద్రంలో సిద్ధార్థ పాఠశాలలో శనివారం ముందస్తు హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఒకరి కొకరు రంగులు చల్లుకుంటూ వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కథలాపూర్ : మండలంలోని ఊట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు ముందస్తు హోలి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విరామ సమయంలో విద్యార్థులు ఒకరినొకరు రంగులు పూసుకుని వేడుకలు జరుపుకున్నారు. కొంగొత్త రంగుల జీవితం గడపాలని కోరుకుంటూ కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాపాధ్యాయుడు చెన్న రాజశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



ముందస్తు హోలీ వేడుకలో పాల్గొన్న విద్యార్థులు ఉపాధ్యాయులు

మున్సిపల్ అధికారుల దాడులు



అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు

మెట్‌పల్లి, మార్చి, 23 : పట్టణంలో పలు ఫాస్ట్ ఫుడ్ పానీ పూరి సెంటర్లపై శనివారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదేశాలతో ఇన్‌చార్జి గుర్రం రత్నాకర్ ఆధ్వర్యంలో ఫాస్ట్ ఫుడ్, పానీ పూరి సెంటర్లలో దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని రూ.4000లు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక

కోరుట్ల, మార్చి 23: కోరుట్ల బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు ఎన్నికల అధికారులు మచ్చ రమణ మూర్తి, చెన్న విశ్వనాథం, వోటరికారి శ్రీనివాస్, సంగ విజయసాయిలు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా సుతారి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా మద్దుల రోజ, కోశాధికారిగా చిలువేరి రాజేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్ష పదవికి ఈ నెల 28వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్ష పదవికి తన్నీరు శ్రీనివాస్‌రావు, బైరీ విజయ్, ఎక్స్‌క్యూటీవ్ పదవి కోసం సయ్యద్ అనసోద్దిన్, ఎండీ ఫసియోద్దిన్, మరిపల్లి గంగాధర్, సూతరి నవీన్, చింతకింది ప్రేమ్ కుమార్, వురడి నరేందర్ పోటీలు ఉన్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, మార్చి 23 : రానున్న ఎంపీ ఎన్నికల్లో కాం గ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు అంకిత భావంతో కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ద్యావ తిపోతరాజుల సంక్షేమ సంఘం సభ్యులు 40 మంది, ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన గౌడ సంఘం, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాప్ నిర్వహణ

సారంగాపూర్, మార్చి, 23: లైసెన్స్ ఒక దగ్గర వైన్ షాప్ మరో చోట నిర్వహిస్తుండడంపై గ్రామస్థులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. సారంగాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం వైన్‌షాప్‌ను మంజూరీ చేసింది. అయితే షాప్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా సారం గాపూర్ వైన్ షాప్‌ను లక్ష్మీదేవిపల్లికి తరలించారు. దీంతో సారంగాపూర్‌లోనే కొనసాగించాలని ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. అయినప్పటికీ ప్రారంభించ కపోవడంతో సారంగాపూర్ వైన్ షాప్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

జడ్పీచైర్‌పర్సన్ పూజలు

జగిత్యాల రూరల్, మార్చి 23 : జగిత్యాల మండలం మోతె శివారులోని నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సత్సంగ్ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మవారి దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్లు కొలగాని ప్రేమలత, శ్రీలత, జమున, ఝాన్సి, నవ దుర్గసేవా సమితి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఇల్లంతకుంట, మార్చి 23: మండలంలోని ముస్కానిపేటలో లక్ష్మీనర్సింహ్మాస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమ య్యాయి. మూడు రోజులపాటు కొనసాగే ఉత్సవాల్లో తొలిరోజు పుణ్యాహవచనం, అంకురార్పణ, విశ్వక్సేన ఆరాధన వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గొల్లపల్లి, మార్చి 23: మండలంలోని చిలువకోడూర్ చౌరస్తాలో అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు పట్టుకున్నారు.పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నీరుకుల గ్రామానికి చెందిన ముగ్గురు ట్రాక్టర్ యజమానులు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ధర్మారం ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు తెలిపారు. యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.